క్లుప్తంగా

దుక్కి దేవమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



పొన్నూరు: మండలంలోని వెల్లలూరు గ్రామంలో వేంచేసియున్న దుక్కి దేవమ్మ తల్లి తిరునాళ్ల పురస్కరించుకొని శుక్రవారం విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ పాల్గొని, అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఇక్కుర్తి మల్లికార్జునరావు, బండి బాబు, నాయకులు పాల్గొన్నారు.

అంజనాసుతునికి నింబ ఫలార్చన



తెనాలి: పట్టణ మారీసుపేటలోని శ్రీ బాలత్రిపుర సుందరీ సమేత శ్రీచంద్రశేఖర స్వామి దేవస్థానంలో జరుగుతున్న హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆంజనేయ స్వామివారికి నింబ ఫలార్చన చేశారు. దేవస్థానంలో ఈనెల 26వ తేదీ నుంచి ఒకటో తేదీ వరకు హనుమజ్జయంతి ఉత్సవాలు, పది లక్షల ప్రదక్షిణముల మహాయజ్ఞం జరుగుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా జరిగిన విశేష పూజల అనంతరం లలితా గోష్టిచే హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు గ్రంధి సేతుమాధవరావు, కార్యదర్శి పొన్నూరు నాగసూర్య శశిధరరావు, కోశాధికారి వరదా వెంకట శేషగిరిరావు, పేరుబోయిన అంకమ్మరాజు, తాడిపర్తి హరిప్రసాద్ పర్యవేక్షించారు.

విజయకీలాద్రిపై హనుమజ్జయంతి వేడుకలు



తాడేపల్లి రూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై హనుమాన్ జయంతి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ హనుమాన్ జయంతి ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు శుక్రవారం ఆంజనేయస్వామికి ఉదయం పంచామృతాలతో విశేష అభిషేకం, మన్యుసూక్త హోమం, ప్రత్యేక అలకంరణ, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. సాయంత్రం తమలపాకులతో స్వామి వారికి అష్టోత్తర శతనామార్చన, మడమాల సేవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించినట్లు పేర్కొన్నారు. శనివారం హనుమాన్ జన్మోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు శ్రీనివాసాచార్యులు, అనంత స్వామి పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న వేసవి శిక్షణ శిబిరం



తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం నేటితో ముగియనున్నదని నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని అమరావతి ఐకాన్ క్లబ్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో బాలోత్సవాల కన్వీనర్ పిన్నమనేని మురళీకృష్ణ, ఎంటీఎంసీ బాలోత్సం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి మాట్లాడుతూ 22 రోజుల పాటు నిర్వహించిన బాలల వేసవి శిక్షణ శిబిరం శనివారంతో ముగియనున్నదని, ఆదివారం ముగింపు సభను ఏర్పాటు చేసి శిక్షణ శిబిరంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి సర్టిఫికెట్‌ను అందజేస్తామని, ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేయనున్నామని వారు తెలిపారు. వేసవి శిక్షణ శిబిరంలో నృత్యం నేర్చుకున్న చిన్నారులతో నృత్య ప్రదర్శన నిర్వహించనున్నామని, ఈ ముగింపు సభకు రాష్ట్ర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి డాక్టర్ రావి శారద, కాన్ఫడరేషన్ ఆఫ్ అపార్ట్‌మెంట్స్ అసోసియేషన్ తాడేపల్లి అధ్యక్షుడు జీఎస్ఆర్ మోహనరావు, బాలోత్సవం గౌరవాధ్యక్షులు నన్నపనేని నాగేశ్వరరావు, అమరావతి ఐకాన్ మిత్ర బృందం యడ్ల బాలకృష్ణ తదితరులు హాజరు కానున్నారని వివరించారు.

సంక్షేమం దిశగా బారులు తీరి..

పొన్నూరు: గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సార్వత్రిక ఎన్నికల్లో మహిళా ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ప్రభుత్వం చేసిన మేలును మరువకుండా గత నెల 13న పోలింగ్ కేంద్రాల్లో రాత్రి 10గంటల వరకు బారులు తీరి.. ఓటర్లు తీర్పు ఇచ్చినట్లు తెలుస్తోంది. పొన్నూరు నియోజకవర్గంలో మొత్తం 2,27,135 ఓటర్లు ఉండగా 1,93,019 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. 84.98 శాతం పోలింగ్ నమోదైంది. వారిలో పురుషులు 93,464 మంది, మహిళలు 99,552 మంది ఓటు వేశారు. పురుషుల కంటే మహిళలు 6,088 మంది అధికంగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. ప్రజలకు అందించిన సంక్షేమానికి ప్రభావితం కావడం తోనే ఈ ఎన్నికలలో ఓటింగ్ శాతం మరింతగా పెరిగిందని వైఎస్ఆర్ సీపీ శ్రేణులు చెబుతున్నారు. ఓట్ల లెక్కింపునకు సమయం దగ్గర పడటంతో అభ్యర్థులు, వివిధ పార్టీల శ్రేణుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. క్షణం క్షణం ఓ యుగంలా గడుపుతున్నారు. జూన్ 4న ఉదయం నంబూరులోని ఏఎన్‌యూ ప్రాంగణంలోని 204 గదిలో పొన్నూరు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఓట్ల లెక్కింపు జరుగనుంది. ఈ నియోజకవర్గంలో 14 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. వీరిలో ప్రధానంగా వైఎస్ఆర్ సీపీ, టీడీపీ అభ్యర్థుల మధ్యే పోటీ నెలకొంది. గ్రామీణ నేతలు కూడా తమ గ్రామాల్లో తమకు ఏ మేరకు అనుకూలంగా ఓట్లు పోలయ్యాయో అనే దానిపైనే లెక్కలు కడుతున్నారు. మున్సిపల్ పరిధిలోని వార్డు నేతలు సైతం ఇదే పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.



పోలింగ్ కేంద్రంలో బారుల తీరిన మహిళా ఓటర్లు(ఫైల్)

సూర్య ప్రతాపం.. అంతా నిర్మానుష్యం



కూరగాయల మార్కెట్ సెంటర్



అంబేడ్కర్ సెంటర్

పొన్నూరు: భానుడి భగభగలకు జనం విలవిల్లాడుతున్నారు. రోహిణి కార్తె ప్రవేశించడంతో గతంలో కంటే ఎక్కువగా సూర్యుడు మండిపడుతున్నాడు. ఉదయం 10గంటలు దాటిందంటే బయటకు వెళ్లేందుకు జనం జంకుతున్నారు. విపరీతమైన ఎండల దృష్ట్యా ఉపాధి కూలీలు, ఇతర కూలి పనులు చేసుకునేవారు 11 గంటలలోపే ఇంటిబాట పడుతున్నారు. ఉక్కపోత, వడగాడ్పులకు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మధ్యాహ్న సమయంలో పట్టణంలోని ప్రధాన కూడళ్లు బోసిపోతున్నాయి. నిత్యం జనంతో కిటకిటలాడే అంబేడ్కర్ సెంటర్, బాపట్ల రోడ్డు, రేపల్లె బస్ స్టాప్, కసుకర్రు రోడ్డు, తహసీల్దారు కార్యాలయం రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్ వెలవెలబోతున్నాయి. ఎండలో పనులకు వెళ్లేవారు శీతల పానియాలు, కొబ్బరికోండాలు తాగుతూ ఉపశమనం పొందుతున్నారు. అత్యవసర పరిస్థితుల నేపథ్యంలో బయటకు వెళ్లేవారు కనీస జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వడదెబ్బకు గురైతే ప్రథమ చికిత్స తీసుకొని సమీపంలోని ఆసుపత్రులను సంప్రదించాలని వైద్యులు సూచిస్తున్నారు. వృద్ధులు, చిన్నారులు, గర్భిణుల విషయంలో కుటుంబ సభ్యులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరిస్తున్నారు. వేసవిలో చలి వేంద్రాలు ఏర్పాటు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వివిధ ప్రాంతాల నుండి పట్టణానికి వచ్చే ప్రజలు దాహార్తితో అల్లాడుతున్నారు.

విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఏసీ కళాశాల ఎదుట ఉన్న ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో ప్రపంచ పొగాకు వ్యతిరేకదినం సందర్భంగా విద్యార్థులకు శుక్రవారం డ్రాయింగ్ పోటలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు డ్రాయింగ్, పేపర్ ఆర్ట్, కథలు, కథానికలు నేర్చుకుని సృజనాత్మక నైపుణ్యాలను అభివృద్ధి పరచుకోవాలని సూచించారు.

నాణ్యమైన భోజనం అందించాలి

ఫిరంగిపురం: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఉపవిద్యాశాఖాధికారి పి.వెంకటేశ్వరరావు కోరారు. స్థానిక సెయింట్ పాల్స్ హైస్కూల్‌లో వివిధ పాఠశాలల్లో పని చేసే ఎండీఎం ఏజెన్సీ నిర్వాహకులకు శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. త్వరలో పాఠశాలలు పునఃప్రారంభం అవుతుండటంతో వంటగది శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని చెప్పారు. నాణ్యత విషయంలో ఎటువంటి రాజీపడవద్దని చెప్పారు. శిక్షకురాలు ప్రవీణ పాఠశాలలో భోజన పథకాన్ని ఏవిధంగా నిర్వహించాలో, రుచికరమైన పదార్థాలు ఏవిధంగా తయారు చేయాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ మహబూబ్ సుభానీ పాల్గొన్నారు.

గాయత్రీ సత్యదేవ మందిర వార్షిక బ్రహ్మోత్సవాలు



నగరంపాలెం: స్థానిక ఏటీ అగ్రహారంలోని శ్రీ కంచి కామకోటి పీఠ శంకర గాయత్రీ సత్యదేవ మందిరంలో శుక్రవారం వార్షిక బ్రహ్మోత్సవాలు అట్టహాసంగా ప్రారంభించారు. పదిహేను మంది రుత్వికులతో, వేద పండితుల వేద స్వస్తితో వైభవంగా మొదలయ్యాయి. ఈ బ్రహ్మోత్సవాలను ఆలయ కమిటీ అధ్యక్షులు రాళ్లబండి వేంకట సత్యరామాంజనేయశర్మ పర్యవేక్షించారు.

హనుమజ్జయంతి ప్రత్యేక పూజలు

గుంటూరు రూరల్: హనుమజ్జయంతి పర్వదినాలను పురస్కరించుకుని అమరావతి రోడ్డు గోరంట్ల గ్రామంలో వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వరాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు, వ్రతాలను చేశారు. అదేవిధంగా స్వామివారికి తమలపాకుల సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. స్వామి తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు. శనివారం హనుమజ్జయంతి సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది.



ప్రత్యేక అలంకరణలో అభయాంజనేయస్వామి

వైభవంగా శ్రీహనుమాన్ శోభాయాత్ర



శ్రీహనుమాన్ శోభాయాత్ర



శోభాయాత్ర ముందు భాగాన స్వామి పతాకాలతో మహిళలు

తెనాలి: పట్టణ షరాఫ్‌బజారులోని శ్రీసువర్చలా సమేత శ్రీపంచముఖ ఆంజనేయస్వామి వారి దేవస్థానంలో జూన్ ఒకటి నుండి 11వ తేదీ వరకు జరగనున్న 16వ వార్షిక లక్ష శ్రీహనుమాన్ చాలీసా పారాయణ, వార్షిక శ్రీ హనుమజ్జయంతి మహోత్సవాల సందర్భంగా శుక్రవారం శోభాయాత్రను నిర్వహించారు. దేవస్థానం నుంచి ప్రారంభమైన ఈ శోభాయాత్ర షరాఫ్ బజార్, బోస్‌రోడ్డు, మెయిన్ రోడ్డు, సత్యనారాయణ టాకీస్ రోడ్డు మీదుగా సాగింది. ఆంజనేయ స్వామి పతాకాన్ని చేపట్టి భక్తులు శ్రీరామ జయ రామ జయజయ రామ అంటూ శోభాయాత్రలో పాల్గొన్నారు. మహిళలు విశేష సంఖ్యలో పాల్గొని తమ భక్తిని చాటుకున్నారు. ఆలయ ఈవో అవుతు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ స్వామి హనుమాన్ జన్మదిన వేడుకల్లో భాగంగా శోభాయాత్ర నిర్వహించినట్టు తెలిపారు. జూన్ ఒకటో తేదీ నుంచి జరిగే వార్షిక హనుమాన్ జన్మదిన వేడుకలు, శ్రీ హనుమాన్ చాలీసా పారాయణ ఉంటాయన్నారు. ప్రతిరోజు 108 సార్లు శ్రీ హనుమాన్ చాలీసా పారాయణ, స్వామి వారికి విశేష పూజాది కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు తీసుకోవాలని కోరారు. ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు ఎస్.బి.శివ, సంకీర్తన బృందం అధ్యక్షురాలు మూర్తి అనురాధ, సంకీర్తన సేవా సమితి సభ్యులు మూర్తి వెంకటేశ్వరరావు, గుడివాడ బాలకృష్ణ, మడుపల్లి చంద్రశేఖర్, ఆర్.సురేష్, ఎం.వెంకటేష్, కె.రాజశేఖర్, బి.లీలాప్రసాద్, సంకీర్తన బృందం సభ్యులు పాల్గొన్నారు.

జెముడుపాడులో కార్డన్ సెర్చ్



జెముడుపాడు కార్డన్ సెర్చ్‌లో స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు

జెముడుపాడు(కొల్లిపర): సమస్యాత్మక గ్రామాల్లో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. శుక్రవారం మండలంలోని జెముడుపాడు, పాలెం లో తెనాలి డీఎస్పీ రమేష్ ఆదేశాలతో తెనాలి లోకల్ 3టౌన్ సీఐలు, గ్రామీణ సీఐలు, కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఎస్ఐ ఆర్.రవీంద్రరెడ్డి ఉన్నత అధికారులతో కలసి సుమారు 50 మంది పోలీస్‌సిబ్బంంది తో అనుమానితుల ఇళ్లు, పాతనేరస్తుల ఇళ్లలో తనిఖీచేసి సరైన ఆధారాలు చూపని 18 ద్విచక్రవాహనాలను సీజ్ చేశారు. రానున్న ఎన్నికల కౌటింగ్ సమయంలో గ్రామంలో అల్లర్లకు పాల్పడినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో తెనాలి, కొల్లిపర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

గుంటూరు రూరల్ మండల సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీడీవో ఆదినారాయణ, ఎంపీపీ పద్మావతి, ఏఎంసీ చైర్మన్ రవిదేవరాజు

గుంటూరు రూరల్: గ్రామాల్లో తాగు నీటి ఎద్దడి తలెత్తకుండా తగిన జాగ్రత్త చర్యలు పాటించాలని ఎంపీడీఓ ఆదినారాయణ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో రూరల్ మండలం సర్వసభ్య సమావేశం ఎంపీపీ ఇంటూరి పద్మావతి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు గతంలో చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. అదేవిధంగా రానున్న కాలంలో చేపట్టాల్సిన కార్యాచరణను వివరించారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. మౌలిక వసతులు కల్పన ఎంతో అవసరమని చెప్పారు. వేసవిలో ప్రజా సమస్యలు, డ్రెయినేజీ, తాగునీరు, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. మండల అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యాచరణను అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ ఆళ్ళ రవిదేవరాజు, వైఎస్ ఎంపీపీ దర్శి సుజాత, ఎంపీటీసీలు భూలక్ష్మి, కో-ఆప్షన్ సభ్యుడు కరిముల్లా, ఇంటూరి అంజిరెడ్డి, దుగ్గెంపూడి యోగేశ్వర్‌రెడ్డి, ముక్కమళ్ళ సాంబిరెడ్డి, సర్పంచ్‌లు మబ్బు శిరీష, నల్లమేకల అప్పమ్మ, మాధవరావు, పంచాయితీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

అజెండా ఏకగ్రీవంగా ఆమోదం



కొళాయి పన్నుపై పరస్పరం విమర్శించుకుంటున్న సభ్యులు



సమావేశానికి అధ్యక్షత వహించిన చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక

ప్రశాంతంగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

తెనాలిరూరల్: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శుక్రవారం ఉదయం మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్లో జరిగింది. మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎజెండాలో ప్రతిపాదించిన అంశాలపై కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. కుళాయిలపై వేస్తున్న పన్ను విషయమై కౌన్సిల్ సభ్యుల మధ్య వాదనలు జరిగాయి. టీడీపీ కౌన్సిలర్ అన్నం పిన్నారావ్ మాట్లాడుతూ తన వార్డులో వేసిన కుళాయిల్లో నీటి సరఫరా లేదని, అయినా కుళాయిలకు పన్ను వేయడం సమంజసం కాదంటూనే పురపాలక సంఘం దోపిడీ చేస్తుందన్నారు. దీనికి వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ తాడిబోయిన రామయ్య మాట్లాడుతూ నీటి సరఫరాలేని కుళాయిలకు పన్ను వేయడం టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిందని, దోపిడీ అనేది మీ టైంలోనే జరిగిందని విమర్శిస్తూ కౌంటర్ వేశారు. ఇంతలో చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక కలుగజేసుకొని దోపిడీ అనడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. మరో టీడీపీ కౌన్సిలర్ పసుపులేటి త్రిమూర్తి కలగజేసుకుని పన్ను వసూలు చేయడం తప్పు కదా అని అనటంతో సభ్యుల మధ్య వాదనలు జరిగాయి. ఈ నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్ శేషన్న మాట్లాడుతూ గతంలోనూ ఇదే సమస్యపై చర్చ జరిగిందని, ఇందుకు సంబంధించి కమిటీ వేశానని, ఈ లోగా ఎన్నికల కోడ్ రావడంతో ఆగిపోయిందని చెప్పారు. ఆరో తేదీ తర్వాత దీనిపై సమగ్రమైనటువంటి నివేదిక ఇస్తానని కమిషనర్ చెప్పడంతో సమావేశం ప్రశాంతంగా ముగిసింది. ఈ సమావేశంలో మున్సిపల్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు- క్రేన్ ఢీకొని ఇద్దరికి గాయాలు



ధ్వంసమైన బస్సు, క్రేన్ ముందు భాగం

తెనాలిరూరల్: ఆర్టీసీ బస్సు, క్రేన్ ఢీకొన్న ఘటనలో ఇద్దరు గాయాలపాలవగా రెండు వాహనాలూ ధ్వంసమయ్యాయి. స్థానిక యడ్ల లింగయ్య పెట్రోలు బంకు రోడ్డులోని ఆషా థియేటర్ వద్ద పల్లె వెలుగు ఆర్టీసీ బస్సు- క్రేన్ ఢీకొన్న ఘటన శుక్రవారం ఉదయం జరిగింది. గుంటూరు నుండి వస్తున్న ఆర్టీసీ బస్సు ప్రయాణీకులని దించి బస్ స్టేషన్ వైపుకు వెళుతుండగా ప్రియ డీలక్స్ వైపు నుంచి క్రేన్ రోడ్డు పైకి రావడంతో అదే సమయంలో అతివేగంగా వస్తున్న ఆర్టీసీ బస్సు క్రేన్‌ని ఢీ కొట్టింది. క్రేన్ ముందు భాగం, టైర్ పగిలి పోయింది. ఇదే సమయంలో క్రేన్ పక్కగా స్కూటీపై వెళుతున్న షేక్ అషీబా, రాజశేఖర్ లకు గాయాలయ్యాయి. గాయాలైన వారిని స్థానికులు 108 ద్వారా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సు మరొక ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేసి అతివేగంగా రావటం వల్లే ఈ ప్రమాదం జరిగిందని క్రేన్ యజమాని ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. ఈ ప్రమాదంలో క్రేన్ సహా ఆర్టీసీ బస్సు ఎడమ భాగం పాక్షికంగా ధ్వంసమైంది. అంత పెద్ద ప్రమాదం జరిగినా ఎవరికీ ప్రాణాపాయం లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

తెనాలి ఠాణాలో ప్రైవేటు చోదకుల హవా

- లైసెన్సు ఉన్న హోంగార్డులు, కానిస్టేబుళ్లను వద్దంటున్న పోలీస్ బాస్‌లు
- ప్రైవేటు డ్రైవర్లతో దందాలు?



తెనాలిరూరల్: తెనాలి పోలీసు శాఖలో ప్రైవేటు డ్రైవర్లదే హవా నడుస్తోంది. అధికారుల సొంత పనులతో పాటు వారికి సంబంధించిన దందాలు వీరి చేతుల మీదుగానే జరుగుతున్నాయన్నది బహిరంగ రహస్యం. డ్రైవింగ్ లైసెన్సు కలిగిన హోంగార్డులు, కానిస్టేబుళ్లు ఉన్నా వారిని కాదని మరీ ప్రైవేటు వ్యక్తులను డ్రైవర్లుగా అధికారులు పెట్టుకుంటున్నారు. తెనాలి పట్టణం, మండలంకు సంబంధించి నాలుగు పోలీస్‌స్టేషన్లు ఉండగా నలుగురు ప్రైవేటు వ్యక్తులు డ్రైవర్లుగా పని చేస్తున్నారు. డ్రైవింగ్ లైసెన్సు ఉన్న ఇద్దరు హోంగార్డులు, సుమారు 10 మందికిపైగా కానిస్టేబుళ్లు ఉన్నారు. అయినా వీరెవరినీ డ్రైవర్లుగా వినియోగించుకునేందుకు అటు ఎస్‌ఐలు, ఇటు సీఐలు ఆసక్తి చూపడంలేదు. తమకు కావల్సిన బయటి వ్యక్తులనే డ్రైవర్లుగా పెట్టుకుని అసలు సిబ్బందిని నిర్లక్ష్యం చేస్తున్నారు.

దందాల కోసమే ప్రైవేటు వ్యక్తులా.?

పోలీసు అధికారులు చేసే అక్రమాలు, దందాల కోసమే ప్రైవేటు వ్యక్తులను సొంత డ్రైవర్ల కింది పెట్టుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల ఎన్నికల బదిలీల్లో వచ్చిన అధికారులు సైతం ప్రైవేటు వ్యక్తులనే డ్రైవర్లుగా పెట్టుకున్నారు. తెనాలిలోని ఓ పోలీస్‌స్టేషన్‌లో డ్రైవరుగా పని చేస్తున్న యువకుడిపై అనేక ఫిర్యాదులు రావడంతో కొద్ది రోజుల క్రితం విధులకు రావద్దని స్టేషను సిబ్బంది చెప్పి పంపారు. అదే స్టేషనుకు కొత్తగా వచ్చిన ఎస్‌ఐకు అనుకూలంగా ఉంటుండడంతో తిరిగి డ్రైవరుగా కొనసాగిస్తున్నట్టు తెలిసింది. తమకు అనుకూలంగా ఉండే ప్రైవేటు వ్యక్తులను డ్రైవరుగా పరిచయం చేసి వాళ్ల ద్వారానే వసూళ్లు, ఇతర దందాలకు పాల్పడుతున్నట్టు సమాచారం. ఇందు కోసమే బయటి వారికి అధికారిక వాహనాలు అప్పజెప్పి తిప్పుతున్నారని పోలీసుల శాఖలోనే గుసగుసలు వినిపిస్తున్నాయి. కొందరు ప్రవేటు డ్రైవర్లు ప్రభుత్వ వాహనంలో దర్జాగా తిరుగుతూ అందినకాడికి దండుకుంటున్నారన్న విమర్శలూ లేకపోలేదు. పోలీసుల శాఖలో ప్రైవేటు డ్రైవర్లను నియమించుకునేందుకు ఎటువంటి ప్రొవిజను/ అధికారిక బడ్జెట్ లేదు. అయినా వేలాది రూపాయలు వీరికి జీతాలుగా ఇస్తూ/ఇప్పిస్తూ బయటి వ్యక్తులను సొంత డ్రైవర్లుగా నియమించుకుంటున్నారు.

ఫిర్యాదులపై సమీక్షిస్తా

ప్రైవేటు డ్రైవర్లపై వస్తున్న విమర్శలు, ఫిర్యాదులపై త్వరలో సమీక్ష నిర్వహిస్తా. నిబంధనలకు వ్యతిరేకంగా నియామకాలు జరిగి ఉంటే చర్యలు తీసుకుంటాం.

-ఎం.రమేష్, డీఎస్పీ

ఘనంగా హీరో కృష్ణ జయంతి వేడుకలు



తాడేపల్లి రూరల్: నటుడు, నిర్మాత సూపర్‌స్టార్ కృష్ణ జయంతి వేడుకలను శుక్రవారం దుగ్గిరాల గ్రామంలోని జెండాచెట్టు సెంటర్ వద్ద ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని మట్లాడుతూ సూపర్‌స్టార్ ఘట్టమనేని కృష్ణ ఈ జిల్లావాసిగా సినిమా రంగంలో ప్రవేశించి అగ్ర నటుడుగా ఎదిగి ఎన్నో విప్లవాత్మకమైన పాత్రలు పోషించి, తెలుగు చలన చిత్ర పరిశ్రమలో ఎవ్వరూ చేయలేని ప్రయోగాలు చేసి డేరింగ్ అండ్ డాషింగ్ హీరోగా పేరుగాంచారని అన్నారు. కార్యక్రమంలో షేక్ జాన్ సైదా, షేక్ సమీఉల్లా, ఖాదర్ బేగ్, మహమ్మద్ అయూబ్, మహమ్మద్ హనీఫ్ బేగ్, కాకా వెంకటేశ్వర్లు, మునిపల్లి కుమార్, బొద్దులూరి వెంకటేశ్వరరావు, రంగారావు పాల్గొన్నారు.